24. అతిథి

నేను గుంటూరులో బి.ఎ. క్లాసు చదువుతూ వున్నప్పటి సంగతి.

నేను, ఆనందమూ ఒకే గదిలో వుండే వాళ్ళం. వాడు నాకన్న ఒక క్లాసు జూనియర్ అయినా – ఇద్దరం ఒక పట్టణంలోనే, ఒక హైస్కూల్లోనే చదువుకున్నవాళ్ళ మవటం వల్ల చదువుసంధ్యల్లో కలిసిమెలిసి వుండేవాళ్ళం.

ఒకనాడు సాయంకాలం పార్కులో భద్రం మాస్టారు కన్పించారు. మేము హైస్కూల్లో చదువుతూ వున్నప్పుడు ఆయన హిస్టరీ, జాగ్రఫీలు చెప్పేవారు; గురువర్యులు కన్పించారని చెరివొక నమస్కారబాణాన్నీ ప్రయోగించాం.

"ఓహెూ! మాస్టారూ–క్షేమమా? ఎప్పుడు వచ్చారు? మన వాళ్ళు (అంటే, ఆ హైస్కూల్లోని ఇతర మాస్టర్లు. మేము ఎరిగిన ఇతర విద్యార్థ, విద్యార్థినులు) బాగున్నారా?" అంటూ ఆనందం ప్రశ్నించాడు.

మాస్టారు ఉబ్బి, తబ్బిబ్బై – "ఓ! మీరా! ఆ, అందరూ క్షేమమే. మీరు ఇక్కడ చదువుతూ వున్న సంగతి తెలుసు కాని, రూము ఎక్కడో తెలిసింది కాదు. నేను నిన్నరాత్రి వచ్చాను – కలక్టరాఫీసులో పనివుండి. ఇంకా రెండు మూడు రోజులు పట్టవచ్చు ఆ పని. ప్రస్తుతం... హెూటల్లోనే మకాం" నీళ్ళు నమిలారు.

ఇక బాగుండదని ఆనందం, "మా రూము వుండగా మీకు హెూటల్ ఎందుకండీ?" అన్నాడు.

చిక్కిందే సందనుకున్న మా మాస్టారు – "దానికేం! రూము ఎక్కడో తెలిసింది కాదు" అన్నారు.

"సరే వెళ్దాం పదండి."

"ఎంతదూరం?"

"అరండల్ పేట - పిచ్చికలగుంట దగ్గర."

"అబ్బ! ఇవ్వాళ నడిచి, నడిచి కీళ్ళన్నీ పట్టుకుపొయ్యాయోయ్! ఏదైనా జట్కా పిలుద్దూ."

సరేనని జట్కా పిలిచాం. మాస్టారు కొద్దిగా స్థూలకాయులవటంవల్ల జట్కాలోకి మెల్లిగా ఎగబ్రాకి తమ బొందితో సగం జట్కాను ఆక్రమించారు. మిగతా సగం చోటులోనే మేముకూడా ఎక్కాము. మాస్టారు జట్కా హొటల్‌మీదుగా పోనిచ్చి, తమ సామాను జట్కాలో పెట్టించి, మెల్లిగా రూము జేరుకున్నాము. జట్కా దిగి మాస్టారు ఠీవిగా రూము దగ్గరకు వెళ్లారు, జట్కా అద్దెతో తమకేమీ పని లేదన్నట్టు. మాకు తప్పనిసరిగా, జేబులో నుంచి పావలాతీసి జట్కావాడికి ముడుపు చెల్లించవలసి వచ్చింది.

రూములో ప్రవేశించాక, మా మాస్టారు దర్జాగా క్యాంపు కాటుమీద శయనించి (క్షీరసముద్రంలో శ్రీమహావిష్ణువు శేషశాయిమీద పవళించిన, బొమ్మలో లాగు) రూము బాగానే వున్నది; కాని, బాగా చదువుతున్నారా? అసలు మీరు యిద్దరూ ఫస్టుమార్కులతో ప్యాసయ్యే విద్యార్థులు. మీరు పొయ్యాక (అంటే చావటం కాదు!) హైస్కూల్లో, చదువులో అందె వేసిన చెయ్యే లేదోయ్!" అంటూ మమ్మల్ని ఉబ్బవెయ్యటం మొదలుపెట్టారు. ఈ మాస్టారు బోటివాళ్ళను, అదివరకు తొంభైతొమ్మిదిమందిని చూసి వున్న - ఈ కాలేజి స్టూడెంట్సుకు, మాస్టారు మాకు గ్యాస్ కొడుతూవున్న సంగతి తెలియకుండా వుందా? అదివరకు మమ్మల్ని 'డల్ హెడ్స్' అని పిలిచే మాస్టారు, ఇవ్వాళ "మీరే ఇంద్రులు మీరే చంద్రులు" అన్నారంటే - ప్రత్యేకంగా ఆయన తెలివితక్కువతనం బయిట పడటంలా? అందులోనూ ఎండమావుల్లాంటి మా చదువు మాకు తెలియదూ? "ఆ. ఆ. బాగానే చదువుతున్నాము" అని మాస్టారికి సమాధానం చెప్పాము.

ఏడు గంట లవగానే మాస్టారు. "ఇవ్వాళ పొద్దున ఎప్పుడో అన్నం తిన్నాను. హొటల్ ఇక్కడకు ఎంతదూరం?" అని సణిగారు. మాస్టారు భోజన ప్రియులని మాకు తెలుసు. అయిదుగంటలకు అయ్యర్ హొటల్లో తొక్కిన చపాతీ ఇంకా ఉదర గోళంలోనే గోలచేస్తూ వున్నా, మాస్టారికోసం మేము కూడా బయలుదేరి హొటల్‌కు వెళ్ళాం.

రెండుకప్పుల ఎక్స్ట్రా పెరుగుతో సహా మాస్టారి భోజనం పూర్తయింది. భోజన మయ్యాక మాస్టారికి ఒక కిల్లీ యిచ్చాం. దాన్నొక బుగ్గ కిందికి తోసి - "ఇవ్వాళ సినిమా ఏమిటోయ్!" అన్నారు.

"సినిమా మంచిది కాదు కానండీ, స్థానంవారి సారంగధర వుంది -" ఆనందం అన్నాడు. మాస్టారు సంతోషపూర్వకంగా, "చూసి చాలా రోజులయిందోయ్! అయితే

వెళ్దాం పా” అంటూ, “హాలు చాలాదూరం కాబోలు, అన్నం తిని పరుగెత్తుతే కడుపులో నొప్పివస్తుంది జట్కా పిలు” అన్నారు.

ఈ మాస్టార్ని అనవసరంగా అంటించుకున్నందుకు ఆనందాన్ని లోలోపల తిట్టుకున్నాను. కాని యేమీ అనేందుకు వీలు కాని Situation అవటంవల్ల గప్‌చిప్‌గా వూరుకొని, జట్కాలో పడి హాలుకు జేరుకున్నాం. మళ్ళీ జట్కాకు మా చేతిడబ్బే దర్శించుకున్నాం.

మాస్టారు టిక్కెట్లు కొంటారేమో, కొంత ఖర్చన్నా కలిసివొస్తుందని చూసి, ఇద్దరం కొంతసేపు మాట్లాడకుండా వూరుకున్నాం. కాని మాస్టారు మొండికి వేశారు. మొండి వాడు రాజుకన్న బలవంతుడు:

“ఏం? ఇంకా బుక్కింగ్ తెరవలా!” – మాస్టారు అన్నారు.

“తెరవకేం?” నేను చిరాకుతో అన్నాను.

ఆయన అదేమీ గమనించకుండా “అయితే టిక్కెట్లు తీసుకురాండి,” అని మాస్టారు అతిథీమాగా అన్నారు. టిక్కెట్లు కొనేవాడికన్నా ఇది చెల్లుతుందో చెల్లదో అనిపించింది నాకు. మాస్టారి వాలకంచూస్తే ఒఠ్ఠి ఆముదపురాయుడిలాగా వుంది.

బాగుండదని ఆనందం బుక్కింగు దగ్గిరకువెళ్ళి, పది నిముషాల్లో తిరిగివచ్చి, “రూపాయి బేడా టిక్కెట్లులేవు; రూపాయిపదకొండణాల టిక్కెట్టు, రెండు రూపాయిల పావలాకు పెరిగింది” అన్నాడు.

నేను మాట్లాడక ముందే మాస్టారు. “సరే – ఏం చేస్తాం? ఇంతదూరం వచ్చి తిరిగిపోవటం బాగుండదు సరే – కొనుక్కురా –” అన్నారు.

మాస్టారు ఈ ప్రియ శిష్యులమీదే తన మూడో నేత్రం తెరిచారు : సినిమాకు తీసుకువెళ్ళినా సరిపొయ్యేది. డ్రామాకు తీసుకువచ్చి, లేనిపోని కూపంలో పడ్డాము. ఇదెక్కడి బంకమన్నురా, వదిలించుకుందామన్నా వదలేటట్టు లేదని, నేను మాస్టార్ని మనస్సులో తిట్టుకున్నాను.

ఆనందం తెచ్చిన ఇంటర్ క్లాసు టిక్కెట్లతో ముగ్గురం హాల్లోకి ప్రవేశించాము. వెంటనే మాస్టారు అన్నారు –

“సిగరెట్లు లేవూ?” ఒకసారి ఆనందం సిగరెట్టు కాల్చాడని క్లాసులో నానా చీవాట్లూ పెట్టిన, భద్రం మేస్టారికి యివ్వాళ సిగరెట్లు కావలసి వచ్చినందుకు, నాలో నాకే నవ్వు వచ్చింది!

“ఏం సిగరెట్లు కావాలి మాస్టారు!”

“ఇక్కడ గోల్డ్ ఫ్లేకు దొరకదూ?”

"దొరుకుతుంది."

"అయితే ఒక ప్యాకెట్టూ, ఒక అగ్గిపెట్టె అందుకో" - మాస్టారు ఫర్మానా జారీ చేశారు.

నాకు మాత్రం మహా చిరాకుగా వుంది, లేనిపోని తెగలాటకం కొని తెచ్చి పెట్టుకున్నందుకు,

నాటకం ప్రారంభమయి, మూడు సీనులు అయ్యాయో లేదో - మాస్టారు సిగరెట్ పెట్టె ఖాళీ చేసేశారు.

"దాహం అవుతోందోయ్."

"సోడా తెప్పించనా సార్!"

"ఎబ్బే! సోడా ఘాటుగా వుంటుంది, తాగటం కష్టం. డ్రింక్ ఏదైనా తెప్పించు."

సరేనని ఆనందం డ్రింక్ తెప్పించాడు. మాస్టారు ఒక పైనాపిల్ తాగి "అబ్బ దాహం తీరలేదు. ఏదీ ఇంకోటి" అన్నారు.

నాకు, ఇదంతా చూస్తే మాస్టారి వ్యవహారం ఏదో సామెత చెప్తారే - నీ... (ది) కాకపోతే గంగదాకా దేకమని. చులాగ్గా వుంది. మాస్టారు రెండు డ్రింక్సు ఏక్ దమ్మున పీల్చివేశారు - కలియుగ అగస్త్యుడిలాగు.

"ఆనందం! సిగరెట్లయిపొయ్యాయి ఇంకో ప్యాకెట్టు లేదూ?" ప్యాకెట్టు. ఆట సాంతం అయ్యేప్పటికి మాస్టారు 3 సిగరెట్ పెట్టెలు, అరడజను డ్రింకులు చులాగ్గా వూదేశారు.

హాలులోనుంచి బయటపడ్డాక మళ్ళీ జట్కా. మాస్టారి దర్జా జమీందార్లకన్నా వుంటుందా అని నాకు సందేహం కలిగింది. చింత మొద్దుల్లాంటి రెండుకాళ్ళు పెట్టుకొని, మాస్టారు నడవలేరూ? పోనీ జట్కాకు తనేమన్నా ఇస్తాడా? అంతా మాకే ఖర్చు! మా గతి మొగమాటానికి పోతే నానా అవస్థ అయింది.

ఇంక రూముకు వచ్చాక - "కిందపడుకోలేనోయ్ : నా చిన్నతనంలో హాకీ ఆడుతూవుంటే - ఆ కొయ్యబంతి వచ్చి నడుముకు కొట్టుకుంది : ఆ బాపతునొప్పి ఇప్పటిక్కూడా వస్తూ వుంటుంది. ఇవ్వాళ ఆ నొప్పి కొంచెం అధికంగా వుందోయ్!" - మాస్టారు సహేతుకంగా చెప్పారు. ఈ లెక్చరంతా. "మీ క్యాంపు కాటు నాకు సమర్పించి, మీరు చాపలమీద పడి దొర్లండోయ్ - డింభకుల్లారా!" అని చెప్పుటమాని వేరే చెప్పాలా?

మా మాస్టారి వాలకం చూస్తూవుంటే నాకు అరికాలి మంట నెత్తికెక్కింది "అంత బేవార్సుగా ఇక్కడ యేమీ లేవు తక్షణం ఇక్కడినుంచి దయచెయ్యండి" అందామన్నంత

కోపం వచ్చింది. కాని, బాగుండదని పస్తాయించాల్సి వచ్చింది. మాస్టారు మాత్రం హాయిగా పాన్పుమీద పవళించారు ఆ రాత్రి.

మాస్టారు 'ఇంకా రెండుమూడురోజుల పని వుంద'న్నారు. ఈ రెండు, మూడు రోజుల్లోనూ మనను హతమార్చేట్టుగా వున్నాడీయన అని నాకు భయంకూడా వేసింది.

మర్నాడు ఉదయం –

మాస్టారు అప్పటికింకా నిద్ర లేవలేదు. మేము, ఈ నక్షత్రకుడు ఒకపూట వదిలినా వదిలెనేనని – ఆయన్ను లేపకుండా చల్లగా కాఫీకి జారుకుంటూవున్న సమయంలో మాస్టారు తుళ్ళిపడిలేచారు. మళ్ళా మా ఖర్మం కాల్చినందుకు లోలోపల భగవంతుడ్ని తిట్టుకున్నాను.

"ఎక్కడికోయ్! కాఫీకేనా?"

"అవును సార్."

"నేను కూడా వస్తా వుండండి."

మాస్టారు ఎక్కడా డి.పి.లను వృథాపోనిచ్చే రకం లాగు లేరు! వెంటనే కాలకృత్యాలన్నీ ఆపివేసి, ముఖం మాత్రం కడుక్కొని – మాస్టారు మావెంట పడ్డారు.

మా మాస్టారి అల్పాహారం కూడా చెప్తాను! 'రాత్రి ఎక్కువసేపు నిద్ర మేలుకొని వుండటంవల్ల, వేడిచేసిందోయ్!' అంటూ ఉదయమయినా, ఒక ప్లేటు ఐస్ క్రీమ్, ఫ్రూట్ సాలడ్, రెండు ఇడ్లీ సాంబారు – అవి తిన్నాక ఇవి బాగుండలేదోయ్!' అంటూ మఱో రెండు ఇడ్లీ ఛట్నీ, ఒక పెసరట్టు, దాంట్లో నంచుకునేందుకు ఒక ప్లేటు ఉప్మా, రెండు పూరీకూర, రెండు డ్రింకులు – 'ఓవల్ టిన్ లేకపోతే ఫ్రీమోషన్ అవదోయ్!' అంటూ ఒక కప్పు ఓవల్‌టిన్ను ఈ అల్పాహారం చూస్తే నా గుండె చెరువయింది! మాస్టారు దాదాపు తులానికి బిల్లు చేశారు. ఈ అభినవగామావస్తాదును ఏ జమీందార్లో పోషించాలిగాని, మాబోటి స్వాముల వార్లు పోషించలేరని వేరేచెప్పాలా? దురద కొండాకు పసరుతో ప్రారంభమయిన దురదనన్నా వదిలించుకోవచ్చు గాని – ఈ మాస్టారిని మాత్రం వదిలించుకునే వుపాయం నాకేమీ తట్టలేదు. నా వెధవ మట్టిబుర్రను కొంచెంసేపు తిట్టుకున్నా, అప్పటి మా అవస్థ నాడు నక్షత్రక మహాశయుడితో, అడవుల్లో అవస్థపడ్డ ఆ హరిశ్చంద్రుడికి ఒక్కడికే తెలుసు! చచ్చినట్టు బిల్లు చెల్లించి బయటపడ్డాం.

మళ్ళా మధ్యాహ్నం. ఎక్ స్ట్రా పెరుగులతో మాస్టారి భోజనం యథాప్రకారంగా సాగింది. మాస్టారు ఒక్క కునుకు తీసి, అంతా ముంచుకు పోతూవున్నట్టు రెండు గంటలకే లేచి, "ఈ వూళ్ళో పళ్ళేమీ దొరకవూ?" అన్నారు. గుంటూరు వంటి పట్టణంలో పళ్లు దొరుకుతయ్యో, దొరకవో మాస్టారికి తెలియదూ? అంతా మాకు అంట కట్టేందుకు – ఈ ఎత్తు.

"దొరుకుతాయి."

"అయితే - ఒంట్లో బాగుండలేదు కాని - ఒక అరడజను బత్తాయిలు, నాలుగు కమలాఫలాలు, అరడజను నారింజ కాయలు, ఒక పైనాపిల్ టిన్నూ తెచ్చిపెట్టు; ఇదిగో; ఈ సంచీలో వేసుకురా."

మాస్టారు కొన్ని పళ్ళపేర్లు మరిచి పోయినట్లుగా వుంది నాకు.

సంచీ అయితే చేతికి ఇచ్చారు; కాని, పర్సులో నుంచి డబ్బు బయటకు రాదే! 'డబ్బు నీ దగ్గర వుందిగా' అన్నట్టుగా మాస్టారు ఒక కోరచూపు చూశారు.

అధమం పూటకొక తులమన్నా లేనిది మాస్టారి ఉదర గోళం పూరింప బడనట్టు నాకు తోచింది. మాస్టారి సుగ్రీవాజ్ఞ శిరసావహించి, దేవుడో అంటూ ఆ వాగన్ పళ్లూ తెచ్చి ఇచ్చాము. మాస్టారు ఫలహారానికి ఉపక్రమించారు. రెండు బత్తాయిలు తోలుతీసి, కొన్ని తొనల్ని మా ముందుకు తోస్తూ, "మంచి ఆరోగ్యమోయ్! మీరు కూడా రెండు తొనల్ని పుచ్చుకోండి" అంటూ మా ముందుకు కొన్ని తొనల్ని తోశారు. ఇవి కాస్తా ఇప్పుడే అయిపోతే, మరో రూపాయి సరుకు దిగుమతికి ఆర్డర్ పడుతుందేమోనని భయంతో "మాకు అక్కర్లేదు లెండి" అని మేము తప్పుకున్నాము. మొగమాటంమాట తలపెట్టకుండా, మాస్టారు పళ్ళల్లో కొన్ని ఆరగించి, మిగతావి స్టాక్ చేసుకున్నారు.

తిరిగి సాయింకాలం అయిదుగంటలకే మాస్టారు ఆరంభించారు! "అబ్బ! ఎన్ని పళ్ళు తిన్నా ఆకలి తీరదోయ్! కాస్త కాఫీ పొయ్యకపోతే ఆత్మారాముడు శాంతించేటట్టు లేదు; తలకాయ నొప్పికూడా వస్తుంది" - తనకు కాఫీ ఎంత అలవాటో సూచిస్తూ. మాస్టారికి ఇప్పుడు తలకాయ నొప్పివస్తే అమృతాంజనం డబ్బాకు ఆర్డరు పడుతుందని, కాఫీకే తీసుకెళ్లాము. అది మాత్రం తక్కువా? తిరిగి ఆరణాల బిల్లు మా నెత్తిన పడ్డది. మాస్టారి వ్యవహారం కొరివిపెట్టి నెత్తిగోక్కున్నట్టుగా వుంది. అత్తవారు కొత్త శోభనపు పెళ్ళికొడుకును కూడా ఇట్లా మేపుతారో మేపరో నాకు అనుమానమే!

మళ్ళీ రాత్రి యధా ప్రకారంగా భోజనము, దాని తరువాత ఫలహారము, తాంబూలము సక్రమంగా నడిచాయి. మాస్టారు తిరిగి పాన్పు మీద శయనించి గుఱ్ఱుపెడుతూ సుఖ నిద్రపోయారు.

తెల్లవారీ వారకమునుపే మళ్ళీ కాఫీ, ఉప్మాలు మగపెళ్ళివారి ఫలహారాలను విడిదికి తెప్పించినట్లు, మాస్టారు మా చేత రూముకు తెప్పించనందుకు కొంచం సంతోషమే!

కాఫీ సేవించి రూముకు రాగానే మాస్టారు,

"ఇదిగో పోస్టాఫీసు తెరిచారూ?" అని ప్రశ్నించారు. మళ్ళీ మెడకు యేదో వురి తగిలిస్తూ వున్నాడు పుణ్యపురుషుడని నా గుండెల్లో రాయిపడ్డది.

"ఆ! తెరిచే వుంటారు."

"అయితే – ఇవ్వాళ ఇంటికి వుత్తరాలు రాయాలోయ్. నాలుగు కవర్లూ, నాలుగు కార్డులూ తెచ్చిపెడుదూ."

డబ్బు మాత్రం ఇవతలకు రాదే!

ఈ మాస్టారు ఇవ్వాళ సాయింకాలానికి తోకముడుస్తే ఆంజనేయ స్వామివారికి అరడజను కొబ్బరికాయలు కొడతామని మనస్సులో మొక్కుకున్నాం. మాస్టార్ని, తాతముత్తాలతో సహా ఏకరువుపెట్టి మనస్సులో తిట్టుకున్నాం – కాని వదలడే!

కార్డూ కవర్లూ తెచ్చాక 'ఆనక రాస్తాలే' అంటూ మాస్టారు బ్యాగ్‌లో వాటిని జాగ్రత్త పరిచారు. తన పరసనల్ ఎక్స్‌పిండెచర్ కూడా మాచేత పెట్టిస్తున్నాడు – మేము ఏమన్నా ఇంపీరియల్ బ్యాంకులము రిజర్వు బ్యాంకులము అనుకున్నాడేమో – మహాశయుడు!

"ఆఫీసు పని వుందోయ్!"

పో బాబూ! సగం నస తగ్గుతుందని మనస్సులో సంతోషించాము. ఇంతలోకే "భోజనం చేసి వెళ్తాను" అన్నాడు, మళ్ళీ అరణాలు మా చేతిదే!

భోజనమయ్యాక జట్కా పిలవమన్నాడు. జట్కాలో గొబ్బెమ్మలాగు కూర్చొన్నాడు. ఈ సారికన్నా మాకు జట్కా అద్దె తప్పింది లెమ్మనుకున్నాం.

"ఇదుగో! ఆనందం! నా దగ్గర చిల్లరడబ్బులు లేవు. నీ దగ్గరో పావలావుంటే ఇవ్వు" అంటూ భద్రం మాస్టారు, పావుతులం క్యాషూ మా ఆనందం దగ్గర గుంజాడు. ఇలాంటి వ్యక్తి ఇన్సూరెన్స్ ఏజంటుగా వుంటే ఎంత బాగుండునో అనిపించింది నాకు!

ఆ సాయింకాలం –

మాస్టారు స్థూలకాయాన్ని రూముకు జేరవేశారు. వచ్చేప్పుడు నడిచే వచ్చాడు – మానవుడు! మఱి మమ్మల్ని చూస్తేనేనా యీ జట్కాలు:

"ఇప్పుడు బండేమీ లేదూ?"

అమ్మయ్య! రాహువు వదిలి గ్రహణకాలం వదిలిపోతూ వుంది. బ్రతుకు జీవుడా అనుకొని – "ఇంకో ముప్పావు గంటలో ఒక బండి వుంది సార్" అన్నాము.

"అయితే ఏదీ జట్కా?" గగ్గయ్య స్వరంలో నన్నా ధీమా వుందా?

మాకు కోపం ఎక్కువయింది.

ఒక జట్కావాడు మాస్టారి దిలాసాచూసి, మా రూము దగ్గరే గుంటదగ్గిర నక్కలాగు, ఎప్పుడు పిలుస్తామోనని, సెకండ్ హాండ్ బీడిలు కాలుస్తూ పత్తికాయల్లాంటి మిడిగుడ్లు తిప్పుకుంటూ, వేపచెట్టు కింద బిఛాణా పరిచాడు.

ఎట్లాగో మాస్టారి సామాను జట్కాలో వేసి, స్టేషన్‌కు జేరవేశాం. ఏ సెకండు క్లేసు టిక్కెట్టో మాచేత కొనిపిస్తాడేమో ననుకున్నాం; కాని తనే థర్డు క్లాసు టిక్కెట్టు కొని తెచ్చుకున్నాడు. మెల్లిగా ఆ స్థూలకాయాన్ని రైలుపెట్టిలోకి తోసి సాగనంపాము. ఇల్లాంటి అతిథుల్ని ప్రసాదించవద్దని భగవంతుడ్ని ప్రార్థించాము.

రూముకు వచ్చి మాస్టారి కింద ఖర్చయిన డబ్బంతా అంచనా వేస్తే - పదిరూపాయిల పావలాకు తేలింది. కరువు కాలంలో అంతడబ్బు మా చేత ఖర్చు చేయించినందుకు - భద్రం మాస్టార్ని - ఒక పావుగంట సేపు తిట్టాం - కాని ఏం లాభం?

- జనవరి, 1941